# మళ్ళీ మొదటికొచ్చింది

"మన సంస్కర్తలు ఆడపిల్లల తల్లితండ్రులకు మంచి చేశారంటావా చెడు చేశారంటావా ? " అని అడిగాడు నారాయణ హిందీ టీచర్, తెలుగు పండిట్ శర్మను. అది భోజన విరామ సమయం. స్టాఫ్ రూంలో ఇద్దరే వున్నారు.

"మీకెందుకొచ్చిందీ అనుమానం " చదువుతున్న తెలుగువాచకాన్ని మూసి టేబిల్ మీదుంచుతూ అడిగాడు శర్మ.

అప్పుడే సరిగ్గా ఓ ఊరపిచ్చుక గదిలోకి వచ్చి మూలన ఉన్న నీళ్ళకూజా మీద కూర్చుని అటు ఇటు చూసి తిరిగి ఎగిరిపోయింది.,

"ఈ రోజులను, ఈ యువకులను చూస్తుంటే అనుమానం రాదు మరి " అంటూ రెండు చేతులను మెడమీద వుంచుకుంటూ తలపైకెత్తి కప్పువైపు చూస్తూ ఉన్నాడు.

గది నలుమూలలకు సాలీడు నేసిన పరదాలున్నాయి. పదేళ్ళకిందట కట్టించిన హైస్కూల్ బిల్డింగ్ అది.

"మరీ అంగట్లో ధరలున్నట్లు వుంటే ఎలా ?అన్నాడు నారాయణ "

"ఈ సంస్కర్తలు తమకు తట్టిన విషయాన్నే ఆలోచిస్తారు కానీ ఆ తరువాత పరిణామాలను ఆలోచించనట్టుంది. నాణానికి రెండవవైపు కూడా వుంటుంది అన్నాడు మెడమీద చేతులను తీసి టేబిల్ మీద వుంచుతూ. ఐదుపదులు నిండి సగం నెరిసిన తల. కత్తెర వేసిన మీసాలు. సాదాసీదా బట్టల్లో ఎంతో చురుకుగా కనిపిస్తుంటాడు నారాయణ.

"అసలు విషయం ఏమిటో చెప్పండి " అంటూ శర్మ తను ధరించిన సిల్కు లాల్చీ చేతిని పైకి అని తన చేతిని తానే పరిశీలనగా చూసుకుంటూ ఉన్నాడు.

"విషయం మీకంత తొందరగా అర్థం కాదులే అన్నాడు నారాయణ "

"నేను తెలుగు పండితున్ని. మీరు చెప్పేది తెలుగు వారి గూర్చి, ఇక నాకే " అంటూ ఆగాడు శర్మ. ముఖంలో కొంత ధీమా కదలాడగ ఓసారి కనుబొమ్మలను పైకెత్తి చూశాడు. అప్పుడాయన నుదుటి బొట్టు కదిలింది.

" కానీ మీకు ఆడపిల్లలు లేరుగా " అన్నాడు.

"ఓహో అదా సంగతి. అమ్మాయికి మ్యాచ్ కుదరలేదా? " అంటూ తన కుడి చేతిని పిడికిలిగా బిగుపట్టి దానిని నోటి దగ్గర వుంచుకొని వూదుతూ అడిగాడు.

'లేదు' అన్నట్టు తలూపాడు నారాయణ.

“ఈ మధ్య ఎవరో తెలిసిన వాళ్ళఅబ్బాయి బి.టెక్. చేశాడు, ఎ.ఇ గా కూడా పనిచేస్తున్నాడన్నారు, ఏమైంది ” అన్నాడు శర్మ.

ఊర పిచ్చుక మరొకసారి గదిలోకి వచ్చి కూజా మీద వాలి ఈసారి కూజాలోకి తొంగి చూసి, వెళ్ళిపోయింది. దాన్నే గమనిస్తున్న శర్మతో -

“వచ్చారు. అమ్మాయి నచ్చింది అని కూడా ఉత్తరం రాసారు” అంటూ జేబులోనుండి ఓ ఉత్తరం తీసి శర్మకిచ్చాడు.

ఉత్తరం అందుకొన్న శర్మ కుర్చీలో జారిగిలా కూర్చుంటూ విప్పాడు.

“మరింకేమి మీ కా.చా తెప్పించండి ” అన్నాడు శర్మ.

“అది సెటిల్ కానీయండి. కా.చా ఏం కర్మ బి.బి. వుంటుంది మీకు ” అన్నాడు నారాయణ.

‘మహా రాజశ్రీ ఆవుల నారాయణ గార్కి, గుడిపూడి రంగయ్య వ్రాయునది.

మీ ఇంటికి వచ్చినపుడు మీ మర్యాదలు మాకు బాగా అనిపించాయి. చెల్లెలు లక్ష్మీ మీ ఇంటి మహాలక్ష్మి. అంతా ఆమెతోనే మీకొచ్చింది అనుకుంటా. అమ్మాయి రజని అంతా తల్లి పోలిక. కుందనపు బొమ్మ. ఆ అమ్మాయి ఏ ఇంట్లో అడుగు పెట్టినా ఆ ఇంట్లో దీపం పెట్టినట్లే. ఆ దీపాన్ని మా ఇంట్లోనే పెట్టుకోవాలని అనుకుంటున్నాము. మావాడు మహా గుట్టు మనిషి. పిల్ల నచ్చిన విషయం నాతో చెప్పక తల్లితో చెప్పాడట. మా ఇంట్లో ఆఖరి పెళ్ళి. ఆడకూతుళ్ళు లేని ఇల్లు ఆడపిల్లలుంటే వాళ్ళకూ వేరే కదా ? అదీ తప్పింది. ఇకపోతే మావాడు తాను పనిచేసే ఊరు వెళుతూ వెళుతూ నాన్నా నీవు పాతకాలం మనిషివి, నా పెళ్ళి వ్యవహారాలన్నీ డా॥ అన్నయ్యకు వదిలితే, అన్నీ ఆయనే చూస్తాడని, మా తోడల్లుని కొడుకుకు అప్పచెప్పాడు. ఆయన మిర్యాలగూడెంలో పళ్ళ డాక్టరు. మీరు ఆయన్ను కలుసుకోండి. ఆయన ఎట్లా అంటే అట్లానే. ఉంటాను.

మీ శ్రేయోభిలాషి,

గుడిపూడి రంగయ్య.

ఉత్తరాన్ని చదివి నారాయణకిస్తూ -

“శుభం. ఆలస్యం దేనికి? వెంటనే ఆ డాక్టర్ దగ్గరికెళ్ళిరండి. చేసే ప్రయత్నం ఏదో చివరి వరకు చేయాలి కదా ” అన్నాడు శర్మ కదిలి కూర్చుంటూ. అప్పుడాయన బొజ్జ ముందుకు కదిలింది.

“రేపు ఆదివారం కదా. మనిద్దరం వెళ్ళొస్తే ”అన్నాడు నారాయణ.

“అలాగే మంచి పనికి మనం ఎప్పుడూ ముందే ” అంటూ తాను కట్టుకున్న పంచె

చెంగును సరిచేసుకున్నాడు.

"రేపు ఉదయం పదింటికి రడీగా వుండండి. నేను వస్తాను " అని అంటున్నప్పుడే గణగణమని బెల్ మోగింది. మిడుతల దండులాగా పిల్లలు గేటు వైపు పరుగులు తీశారు. వాళ్ళవెనక స్టాఫ్.

నారాయణ ఇంటి వైపు నడుస్తూ వుంటే తనకు గతం గుర్తొచ్చింది. స్వరాజ్యం వచ్చిన తరువాత దళిత వర్గం చదువుకొని వచ్చిన మొదటి బ్యాచ్ ఉద్యోగి అతను. మెట్రిక్ పాస్ కాగానే టీచర్ పనిలోకి చేరాడు. పేదరికాన్ని దాటి, దరిద్రాన్ని పక్కకు నెట్టి ముందుకు వచ్చాడు. తనకు ఆలస్యంగా సంతానం అయినా ఒకే ఒక కూతురు. ఆ కూతురును శ్రద్ధగా చదివించుకుంటున్నాడు. నారాయణ భార్యకు చదువులేకున్నా ఎంతో అనుకూలవతి. ఇద్దరి కోరికల్లా అమ్మాయికి మంచి సంబంధం చూసి పెళ్ళి చేయాలన్నదే.

ఓసారి టీ గ్లాసును భర్తకు అందిస్తూ -

"పంతులు గారూ ఇంతో అంతో కూడబెట్టారు కదా. అమ్మాయికి ఓ డాక్టరునో, ఓ ఇంజనీరునో వెతకండి " అంది నారాయణ భార్య సరోజిని. ఇంటిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న ఇల్లాలు.

"డాక్టర్, ఇంజనీర్లే భార్యను సాదుతారు గానీ మిగతా వాళ్ళూ - అంటూ " ఆగాడు నారాయణ.

"ఎవరైనా ఎందుకు సాదరు ? ఇదిగో మీరు సాదుతున్నారు కదా ఒంటి నిండా బంగారమే " అంది సరోజిని.

నారాయణ నవ్వుతూ "అవునులే బాగా సంపాదించేవాడైతే అమ్మాయి మహా బాగా బతుకుతుంది " అనుకుంటూ ఇంట్లో అడుగు పెట్టాడు.

* * *

బస్సుదిగి ఉత్తరంలోని అడ్రస్ మరొకసారి చూశారు. డా॥ ప్రసాద్, డెంటిస్ట్, బస్టాండ్ ఎదుట, మెయిన్‌రోడ్. ఆ రోడ్ దాటి అవతలికి వెళ్ళారు. బోర్డు కనపడింది. రోడ్డు దాటటం ఓ సాహసం లాంటి పనైంది. ఫుట్‌పాత్‌ల మీద రకరకాల వ్యాపారాలు, పండ్ల బండ్లు, పాన్ బంకులు, రోడ్డంతా వాహనాల రాకపోకల రద్దీ. అటునుండి ఇటుగానీ ఇటునుండి అటుగానీ రాకపోకలు ఎంతో కష్టం. మెల్లగా గేటు దాటి లోపలికి వెళ్ళి తామొచ్చినట్లు డాక్టరుకు కబురంపారు. రమ్మని పిలుపు వచ్చింది. లోపలికి వెళ్ళారు. పరస్పర పరిచయాలు జరిగాయి. వచ్చిన అవిషయం ఎత్తడానికి ముందు -

"నారాయణ గారూ నేను ఒకే స్కూల్లో పనిచేస్తున్నాం " అన్నాడు శర్మ. నారాయణ వయస్సే శర్మది. క్లీన్‌షేవ్, నుదుట తిలకం, సన్నని గోల్డ్ ఫ్రేమ్ కళ్ళద్దాలు, ముఖంలో ఎప్పుడూ

చిరునవ్వు.

"ఆ అలాగా" అన్నట్టు చూశాడు డాక్టరు మెడకున్న స్టెతస్కోపు తీసి టేబిల్ మీదుంచుతూ.

ఆయన వెనుక గోడకు, పక్క గోడకు పళ్ళు గురించి చెప్పే చార్ట్సు తగిలించబడి వున్నాయి. పుర్రెకు దంతాలు ఎలా పాతుకొని వున్నాయో తెలుపుతుంది ఓ చార్ట్. చూడడానికి భయం గొలిపేటట్లు కనిపిస్తూ మరో చార్ట్ ఇంకా ఇంకా ఆ గది నిండా చార్ట్సు.

"వీరి అమ్మాయికి అబ్బాయిని వెదుకుతున్నాం. అమ్మాయి గ్రాడ్యుయేట్, మంచి ఎత్తు, తెల్లని రంగు, మీ కజిన్ ఒకరు ఇంజనీరట, మొన్న వచ్చి చూసి వెళ్ళారు. మిమ్మలను కలిస్తే వివరాలు తెలుస్తాయని ఉత్తరం రాసారు"

"అవును, వాడు ఇప్పటికి పదిమందిని చూశాడు. ఏం చెప్పటం లేదు. మొన్న ఓ అమ్మాయిని చూసి, నచ్చిందని మా పిన్నితో అన్నాడట" అంటూ టేబిల్ మీద వున్న సుత్తెను కదిలించాడు. అందరి దంతాలు ఎలా వుండాలో సలహా ఇస్తూ తన దంతాల గురించి పట్టించుకోనట్టుంది. ఆయన నల్లని ముఖానికి తెల్లని పలు వరుస మాత్రం కాదు.

'డాక్టర్ల టేబిల్ మీద స్టెతస్కోపుతో పాటు రబ్బర్ సుత్తె వుంటుంది, పళ్ళ డాక్టరయినందుకేమో ఇక్కడ మెటల్ సుత్తె వుంది' అని నారాయణ అనుకుంటూ ఉన్నాడు.

"వానికి డబ్బుమీద చాలా ఆశ వుందండి. అమ్మాయి నచ్చితే నచ్చిందని చెప్పొచ్చుగా. వాళ్ళు ఇవ్వగలిగింది తీసుకొని శుభ్రంగా పెళ్ళికి ఒప్పేసుకోవచ్చు కదా" అన్నాడు మళ్ళీ తానే. కానీ ఆ మాట మనస్ఫూర్తిగా అన్నట్లు లేదు. ఆ విషయం ఆయన కళ్ళే చెపుతున్నాయి.

"అవును" అన్నట్లు తలలూపారు ఇద్దరూ.

"అబ్బాయి నాన్నగారు ఏంచేస్తారండి" అడిగాడు శర్మ.

"ఆయన ఆ రోజుల్లో పెద్దగా చదవలేదు, పెద్ద ఉద్యోగీ కారు. కష్టపడి పిల్లవాన్ని మాత్రం చదివించారు" అన్నాడు డాక్టర్ ఓసారి కదిలి కూర్చుంటూ.

"అయితే ఆయనకి ఉండి లేమిడి అన్నీ తెలిసే వుంటాయి" అన్నాడు శర్మ నారాయణను చూస్తూ.

"డాక్టర్ కలుగచేసికుంటూ మీరనేది నిజమే. కానీ మా తమ్ముడు మాత్రం డబ్బు మనిషి" అన్నాడు. అది విన్న నారాయణ నవ్వలేక చూస్తుండిపోయాడు. శర్మగారు నవ్వును తెచ్చిపెట్టుకుంటున్నాడు.

"వాళ్ళకు నాలుగైదు లక్షలు కావాలట. ఆవిషయం వాళ్ళు అడగలేక నామీద పెట్టారు. మా పిన్నేమో అనుకున్నంత వచ్చేవరకు ఆగుదాం అని అంటుంది. ఇప్పుడు ఇస్తున్నారు కూడా" అన్నాడు వాళ్ళ వైపు చూడకుండా టేబుల్ మీద పేపర్ వెయిట్ వైపు చూస్తూ.

కూర్చున్న ఇద్దరిలో ఎవరికీ మాట పెగలలేదు. మౌనంగా టేబిల్ మీదున్న సుత్తెనే చూస్తూ వున్నారు.

"ఇవ్వచ్చు. ఎలక్ట్రిసిటీలో ఇంజనీరు కదా. రెండు చేతులా రాబడి" అన్నాడు డ్యాక్టరు మళ్ళీ తానే.

అది విన్న శర్మ కాస్త కదిలి కూర్చున్నాడు. ఆయన మనసులో ఏదో కీడు మెదిలినట్లు ముఖం పెట్టాడు. నారాయణ ముఖంలో మాత్రం ఓ మాదిరి జీవం లేని నవ్వు కదిలింది. డ్యాక్టర్ డబ్బు విషయం చెప్పినప్పటి నుండి తన చూపులను టేబిల్ మీదనే కేంద్రీకరించాడు. దాని మీద మెడికల్ కంపెనీ వాళ్ళిచ్చిన పెన్ స్టాండు, రాజరికపు కాలాన్ని గుర్తుకు తెచ్చే గంట, దానిని మోగించే ప్లాస్టిక్ సుత్తె వున్నాయి.

"ఇక వెళతాం సార్" అంటూ లేచాడు నారాయణ. శర్మ లేవటానికి సిద్ధం అవుతూ డ్యాక్టర్ వైపే చూస్తూ ఉన్నాడు.

పంటి డ్యాక్టరు పెదవి విప్పలేదు. బెల్ కొట్టాడు. వాళ్ళు అక్కడినుండి కదిలారు.

*　　*　　*

"శర్మ గారూ, ఈసారి మనం డ్యాక్టర్ కోసం కదా వెళ్ళేది. మనతో పాటు ఫ్యామిలీ డ్యాక్టరు గారిని తీసుకువెళ్దాము. ఎంతైనా డ్యాక్టరుతో డ్యాక్టరు కాస్త ఫ్రీగా మాట్లాడుకుంటారు" అన్నాడు నారాయణ.

"అలాగే మనకు పని కావాలి" అన్నాడు శర్మ

"నేను డైరెక్టుగా డ్యాక్టర్ గారిని తీసుకొని బస్టాండుకొచ్చేస్తాను" అన్నాడు నారాయణ

మరునాడు నారాయణ తన ఫ్యామిలీ డ్యాక్టర్ సూర్యం, శర్మ ముగ్గురు కలిసి సూర్యాపేటకు చేరుకుని మెయిన్ రోడ్డులో వున్న కంటాసుపత్రి ముందు నిల్చున్నారు. చాలా ఆధునికంగా వుంది.

అప్పటి వరకు చూసిన పేషంట్ బయటికి రాగానే బెల్ మోగింది. మరొక పేషంట్ లోపలికి వెళ్ళాడు. ముగ్గురు వెయిటింగ్ హాల్లో కూర్చున్నారు. అదే హాల్లో వున్న అద్దాల షెల్ఫుల్లో కండ్లద్దాల డిస్ప్లేను చూస్తు వున్నారు. రకరకాల కంటి అద్దాలు, అధునిక ఫ్రేమ్‌లు, సేల్స్‌మెన్ కస్టమర్లకు ఫ్రేమ్‌లను చూపెట్టి, అక్కడే వున్న అద్దాల్లో చూసుకొమ్మని సూచనలిస్తున్నాడు. ఈలోపు నారాయణకు ఓ అనుమానం వచ్చింది.

'రేపు అల్లున్ని కలవాలని వచ్చినా ఇట్లనే ఎంతోసేపు ఎదురుచూసుకుంటూ కూర్చోవలసిందేగా' అనుకుంటూ అదే విషయాన్ని శర్మ చెవిలో అన్నాడు.

"అవును కదా". అన్నట్టు శర్మ తలూపాడు. అంతవరకు లోపల వున్న పేషంట్ బయటకు రాగానే, సూర్యం డ్యాక్టర్ లోనికి నడుస్తూ నారాయణను, శర్మను రమ్మని సైగ

చేశాడు. లోపలికి వెళ్ళాక పరిచయాలు జరిగాయి. సూర్యం చూడడానికి సీరియస్‌గా కనిపించినా, సందర్భాన్ని బట్టి చాలా చలాకీగా వుంటాడు. అందుకే ఆయనకు మంచి ప్రాక్టీసు వుంది. ఆయనకు తనమీద తనకు నమ్మకం వుండబట్టే ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని స్వంత ప్రాక్టీసు పెట్టుకున్నాడు. దాదాపు పదిహేను ఏండ్లు గడిచినయి. రంగు నలుపు, మనసు తెలుపు. నాలుగు పక్కన సున్నా ఆయన వయస్సు. మంచి ఆలోచనాపరుడు.

"మీ అమ్మాయా" కుర్చీలోనుండి కొంచెం ముందుకు వంగుతూ నారాయణను అడిగాడు కంటి డ్రాక్టరు. అప్పుడు కుర్చీ కిర్రుమంది.

"అవునండీ వారి అమ్మాయే. డిగ్రీ చేసింది" అన్నాడు సూర్యం.

"ఆ తరువాత ఏంచేస్తుంది" అడిగాడు కంటి డ్రాక్టరు కళ్ళను పరిక్షించే భూతద్దాన్ని చేతిలోకి తీసుకుంటూ.

"ఎంట్రన్స్‌లకు సిద్ధమవుతుంది" అన్నాడు శర్మ

"ఫోటో ఏమన్నా తెచ్చారా" అడిగాడు కంటి డ్రాక్టరు.

లేదు అన్నట్టు తలాడించాడు నారాయణ.

"తెమ్మంటే తెచ్చి చూపిస్తాడు" అన్నాడు డా॥ సూర్యం

ఈలోపు ప్లాస్టిక్ గ్లాసుల్లో టీలొచ్చాయి. తీసుకున్నారు. 'కాలం ఎంత మార్పు తెచ్చింది. అద్దపు గ్లాసులైతే తాగినంక మళ్ళీ కడగాలి. వీటితో ఆపనే లేకుండా పోయింది. తాగినాక వాటిని డస్ట్‌బిన్ లో పడేయటమే' అనుకున్నాడు శర్మ.

"ఫార్మాలిటీలు అన్నీ వుంటాయి వున్నంతలో" అన్నాడు సూర్యం సజెస్టివ్‌గా. అప్పుడు ఆయన ముఖాన చిరునవ్వు తొలగి ఏదో ఏకాగ్రత చోటుచేసికొంది.

కంటి డ్రాక్టర్ సూర్యం వైపు మళ్ళగా కుర్చీ మరోసారి 'కిర్రు'మంది.

"సరే డ్రాక్టర్, తరువాత మీకు ఫోన్ చేస్తాను. అంటూ బెల్ కొట్టాడు.

అది గ్రహించిన డ్రాక్టర్ లేచి నిల్చున్నాడు. ఆయనతో పాటు -

"మళ్ళీ కలుస్తామండీ" అంటూ శర్మ లేచాడు. ఆ తరువాత మౌనంగా నారాయణా లేచి అక్కడినుండి కదిలారు.

"అదండీ కథ. డ్రాక్టరు దగ్గర ఫీ పనిచేసినంతగా పరిచయాలు పనిచేయవు" అన్నాడు సూర్యం గేటు బయటకు వస్తూ. ఆ మాటలో ఓ సజెషన్ వుంది.

"ఈ తరం మహాత్యం" అన్నాడు శర్మ రిస్ట్ వాచీలో టైమ్ చూసుకుంటూ.

"ఎవరిని మందలించినా అమ్మాయి బాగా చదివిందా ? ఉద్యోగం చేస్తుందా అని అడగటమే" అన్నాడు నారాయణ ముఖాన్ని చిట్లిస్తూ.

"అవును మేము చదవడానికి చాలా ఖర్చు అయింది. కష్టపడి చదివాం అంటున్నారే తప్ప మరిఅమ్మాయిలకయ్యే చదువుల ఖర్చు, వాళ్ళు కష్టపడి చదవటం ఆలోచించరే?" అన్నాడు శర్మ డాక్టర్ వెనకాల నడుస్తూ.

"అవన్నీ వాళ్ళకెందుకు?డబ్బు కావాలి, డబ్బు" అన్నాడు నారాయణ కాస్త చిరుకోపంతో.

"అందుకే మీకు మాటిమాటికీ సంఘ సంస్కర్తలు గుర్తొస్తున్నారు " అంటూ నారాయణ ముఖంలోకి చూశాడు శర్మ. డా॥సూర్యం మధ్యన ఆగి నవ్వుతూ "అవును మరి గుర్తుకు రారూ? కన్యాశుల్కం పోయి అంతకంటే ఘోరమైన ఈ మహమ్మారి తిష్టవేసింది కదా " అన్నాడు.

"ఇదైతే చెప్పనక్కరలేదు. ఎంతో కొంత ఇచ్చినా పుచ్చుకొని ఇంకా తేవాలని చిత్రహింసలు, ఆ తరువాత సజీవదహనం! అప్పుడయినా ఇప్పుడయినా ఆడకూతురుకే బాధలు " అన్నాడు నారాయణ.

సూర్యం ఆగి "మా అత్తగారిది ఈ ఊరే. కలిసి వస్తా. మీరు నడవండి నేను సాయంత్రం వస్తాను " అని గల్లీ మళ్ళాడు సూర్యం.

"సరే " అన్నట్టు చూస్తూ తరువాత కలుసుకుందాం అన్నట్టు చేతులు జోడించి ఇద్దరు బస్టాండ్ వైపు మళ్ళారు.

"ఈ డాక్టర్లతో మాట్లాడినాక మీకేమర్థమయింది ? " అడిగాడు శర్మ.

"మొదటి డాక్టర్ ముందు ఏమిస్తారు ? ఎంతిస్తారో ముందే చెప్పండి అన్నట్లుంది.

"రెండవ డాక్టర్ సంగతి ? " అడిగాడు శర్మ

"నాకేమీ అర్థం కాలేదు. కనీసం అమ్మాయిని చూస్తాను అనన్నా అనలేదే " అన్నాడు నారాయణ.

వెనుక కారు హారన్ మోగగానే ఉలిక్కిపడి ఇద్దరు పక్కకు జరిగారు. కారు వెళ్ళిపోయింది. దాని వెనకాల భయంకరమైన చప్పుడుతో ఓ ట్రాక్టర్ వెళ్ళింది.

"ట్రాక్టర్ వాళ్ళు హారన్ కూడా మోగించకుండా పైకొస్తున్నట్టే వస్తరు " నిర్లక్ష్యంగా పోతున్న దాన్నే చూస్తూ అన్నాడు నారాయణ. శర్మ ముక్కు దగ్గర కర్చీఫ్ పెట్టుకుంటూ, అది పోయిన వైపే చూస్తూ -

"వాటి చప్పుడే ఓ హారన్, దానికో ప్రత్యేక హారన్ ఎందుకు? రాత్రి పూట చూడాలి ఒంటి కన్ను రాక్షసిలా వస్తుంటాయి" అన్నాడు శర్మ.

"అవును ఎదురుగావచ్చేవాడు ఇదేదో మోటర్ సైకిల్అనుకొని వెళ్ళినా మతాషే ! " అన్నాడు నారాయణ.

ఇద్దరూ బస్టాండ్ చేరి వెయిటింగ్ కుర్చీల్లో కూర్చున్నారు.

"శర్మ గారూ కంటి డాక్టరుకు ఎన్నేళ్ళుంటాయంటారు ?"

"మీకెన్నేళ్ళనిపించింది ?" అన్నాడు శర్మ అప్పుడే వచ్చి ఆగిన బస్సుబోర్డును చదువుతూ -

"నిజం చెప్పమంటారా ?" తన్నుకు వచ్చే నవ్వును ఆపుకుంటు అన్నాడు. ఒకరు ఆవలిస్తే పక్కవానికి ఆవలింత వచ్చినట్టు నారాయణ ముఖంలోని నవ్వు శర్మ ముఖంలో ప్రతిబింబించింది.

"చెప్పండి" అన్నాడు.

"ఏది మీరు చెప్పండి" అన్నాడు నారాయణ.

"నేను తరువాత చెపుతాలే. కాబోయే అల్లుని గూర్చి మనం అదో ఇదో అనగూడదు." అంటూ ఎదురుగా ఉన్న తూకం మిషన్ వాని వైపు చూపును ఉంచాడు.

ఈలోపు "సందాలివ్వండి బాబు" అని ఓ రాగి చెంబుకు నల్లని గుడ్డ కట్టుకొని, కాషాయ వస్త్రాలు ధరించి తలకు అదే రంగు గుడ్డ బిగించిన ఓ దృఢకాయుడైన నడివయస్సు వ్యక్తి వచ్చి నిల్చున్నాడు.

"ఏం నాయనా ఏమిటీ వేషం ? బాగానే గిట్టుబాటున్నట్టుంది. నిన్నుచూస్తేనే కనిపిస్తుంది. నడు, నడు" అన్నాడు శర్మ.

వస్తున్న కోపాన్ని ఆపుకుంటూ "సాయి శరణం" అంటూ కదిలాడు అక్కడినుండి.

"చచ్చినోని పేరు చెప్పి బతకకపోతే ఏదన్నా పని చేసుకొని బతకొచ్చుగా" అన్నాడు శర్మ.

"ఈ దేశంలో ఏ పేరు చెప్పినా పూట గడుపుకోవచ్చు" అన్నాడు నారాయణ.

"సాయిబాబ దేవుడేమీ కాదయ్యా. ఆయనా మనిషే. బ్రతికి కూడా లేడు. మామూలు మనిషిలాగే ఆయనా చచ్చాడు" అన్నాడు శర్మ.

"పోతే ఆ డాక్టర్ వయసు చెప్పమంటారా? ముప్పై, ముప్పై మూడుండవచ్చు. అంతేనంటారా ?" అంటూ శర్మ నారాయణ ముఖంలోకి చూశాడు.

"అవును" అన్నట్టు శర్మ వైపు చూశాడు నారాయణ.

ఆ చెంబువాన్ని చూడగానే ఆ కంటి డాక్టర్ గుర్తొచ్చినట్టుంది.

"మన అమ్మాయికి జోడు కాదయ్యా. అమ్మాయి బంగారు తీగె" అన్నాడు శర్మ.

"ఎంతకని తిరగను శర్మగారూ? ఎవర్ని కదిలించినా లక్షలకు లక్షలు, ఇంజనీరు కథ విన్నారు కదా. డాక్టరేమో అమ్మాయి ఉద్యోగం చేసేవరకూ చదివితే చాలు అంటున్నాడు. అమ్మాయికి బి.ఇడి రావచ్చు లేదా కంప్యూటర్ నేర్చుకుంటుంది. మొత్తం మీద ఉద్యోగం

పస్తుంది. అందుకేనేమో ఇతను కట్నం సంగతి ఎత్తలేదు అంటూ శర్మ ముఖంలోకి చూశాడు.

"ఇప్పుడు ఎత్తకపోతే తర్వాత ఎత్తడంటారా? " అంటూ జంధ్యాన్ని బయటకు తీసి పోగులుగా వేరు చేసి మళ్ళీ బనియనులోకి వేసుకున్నాడు.

"ఎత్తితే ఎంతో కొంత ఇచ్చుకుందాం. ఏం కట్నాలో ఏమో, మా ఇళ్ళలో కూడా యింత పెరిగిపోతే ఎట్లా? " అంటూ నుదుటి మీద చేయి పెట్టుకున్నాడు నారాయణ.

"ఏ కులంలోనైతే ఏమి? మీ కులంలో మీరు చూసేది డాక్టర్లని, ఇంజనీర్లనే కదా? ఏ కులంలోనైనా వాళ్ళందరూ అంతే. వాళ్ళదో కొత్త కులం. అదే డబ్బు కులం " అన్నాడు శర్మ చిరునవ్వుతో.

"మా దాంట్లో ఇప్పుడిపుడే కదా పైకొస్తుంది. అప్పుడే ఇట్లయితే ఎట్లా? ఇప్పటి తరం వాళ్ళు గొప్ప చదువులు చదవచ్చు కాదనను. వాళ్ళకు లక్షలకు లక్షలు ఇచ్చుకొనే స్థాయి మన తరం వాళ్ళకు లేదు కదా?, అది ఆలోచించరేమి? అందునా టీచర్లము " అన్నాడు నారాయణ. ఆయన మాటల్లో కొంతబాధ ధ్వనించింది. అది వాస్తవం కూడా !

అది గ్రహించిన శర్మ కొంతసేపు మౌనం వహించాడు. అప్పుడాయనకు తాను విన్న పూర్వపు రోజులు గుర్తొచ్చాయి. అవును, చేసుకున్న వాడు భార్యను సాదాలి కాబట్టి అతను సంపాదించాలి. అలా వున్న వాడే పెళ్ళి చేసుకుంటాడు అందుకే ఎంతో కొంత ఇచ్చి పెళ్ళి చేసుకొనే వాడు. అది పోయి ఎదురిచ్చే విధానం వచ్చింది. అంతే కాదు. హత్యలకు, ఆత్మహత్యల వరకు వచ్చింది. స్త్రీకి ఏమాత్రం రక్షణ లేకుండాపోయింది'. ఈ లోపుబస్సు రాగానేఎక్కికూర్చున్నారు. బస్సు కదిలింది.

"నారాయణ గారూ ఆ రోజుల్లో అప్పుడున్న పరిస్థితుల్లో కన్యాశుల్కాన్ని కాదనటం అవసరమే. లేకపోతే ఎందరు ఆడపిల్లల బతుకులు వ్యర్థమయ్యేవి?" అన్నాడు శర్మ.

"ఇప్పుడంతకంటే ఎక్కువ? వరకట్నం వేధింపుతో రోజుకెందర్ని సజీవదహనం చేస్తలేరు? "అన్నాడు నారాయణ. బస్సు కదిలింది.

* * *

"డాక్టరు గారు రమ్మన్నారట అన్నాడు "డాక్టరు రూంలోకి అడుగు పెడుతూ నారాయణ.

"రమ్మన్నాను. బి.పి. చూద్దాం అని. కూర్చోండి " అన్నాడు డా॥సూర్యం చిరునవ్వుతో

నారాయణ పక్కన వున్న స్టూల్ మీద కూర్చున్నాడు. నారాయణ చేతికి బి.పి. సంచి తగిలించి డాక్టర్ బి. పి. చూస్తూ "ఏంటి? ఇంతకుముందు నార్మల్‌గా వుండేది. ఈసారి కాస్త ఎక్కువగా చూపిస్తుంది " అడిగాడు డాక్టర్.

"మీకే తెలియాలి " అన్నాడు నారాయణ ఏదో ఆలోచిస్తూ.

"మీరు ఈ మధ్య బాగా ఆలోచిస్తున్నారా? "

మౌనం వీడలేదు నారాయణ బి.పి.స్టాండ్ వైపు చూస్తూ వున్నాడు.

“సూర్యాపేట కంటి డాక్టర్ ఫోన్ చేశాడు. ”

“అవునా ? ” అన్నట్టు చూశాడు.

“తన గాథంతా చెప్పి ” అన్నాడు డాక్టర్ చిరునవ్వుతో

ఏమది అన్నట్టు చూశాడు నారాయణ.

“అతను క్లినిక్ కోసం అప్పు చేశాడట. ఆ అప్పు త్వరగా తీర్చాలట. ”

నారాయణ మౌనంగా వింటున్నాడు.

“అమ్మాయి ఉద్యోగం చేస్తుండాలట. అంతే కాదు, తెల్లని రంగు ఉండి అందంగా వుండాలట. ”

“ఆ డాక్టర్ ఇంతకుముందు మీకు తెలుసా డాక్టర్? ” అడిగాడు.

“ఎందుకు తెలియదు? తెలుసు ” మెడనుండి స్టెతస్కోపు తీసి టేబిల్ మీదుంచుతూ అన్నాడు.

“అమ్మాయి అందంగా వుండాలి సరే? అతను ఎలా వున్నాడంటారు ? ”

“చూశారుగా ఎలా వున్నాడో? ” అన్నాడు వస్తున్న నవ్వును ఆపుకుంటూ.

“అచ్చం నార్సింగ్ దున్నలాగా వున్నాడు. ”

“మగాడు కదా నడుస్తది. అందులో సంపాదించే డాక్టరు. ”

“సంపాదించే వాడికి ఉద్యోగం చేసే భార్య దేనికి ? ఎవరి పని మీద వాళ్ళు పోతే రేపు పిల్లల గతి? ”

“వాళ్ళ కుటుంబం గురించి ఏమన్నా చెప్పాడా డాక్టర్? ”

“చెప్పాడు. నాన్న లేడట. తల్లి నర్సట. మొదట చాలా పేదవాళ్ళుట.

ఇప్పుడిప్పుడే “పైకొస్తుంద్రన్న మాట ” అన్నాడు నారాయణ. ఆయన గొంతులో వెటకారం ధ్వనించింది.

“ ఏది ఏమైనా నేను అతని గురించి ఆలోచించదలుచకోలేదండి ” అని నారాయణ అనగానే -

“మరోసారి బి.పి. చూడనా ” నవ్వుతూ అడిగాడు డాక్టర్.

“మీతో మాట్లాడితే చాలు, బి.పి. తగ్గుతుంది. ”

“అట్లనా థాంక్స్ సార్ ” అన్నాడు డాక్టర్ నవ్వుతూ .